ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై భగ్గుమన్న బీఆర్‌ఎస్

మోత్కూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

మోత్కూరు, మార్చి 13 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకుబ్‌రెడ్డి, తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేందర్ నాథ్, నాయకులు కొండ సోంమల్లు, జంగ శ్రీను, రాంపాక నాగయ్య, విష్ణుమూర్తి, తిరుమలేశ్, బయ్యని పిచ్చయ్య, సత్యం గౌడ్, మల్లేశ్, చేతరాశి వెంకన్న, మల్లయ్య, పరమేశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

గ్రూప్-2లో 11వ ర్యాంకర్ సాయికృష్ణారెడ్డికి అభినందనలు

సాయికృష్ణారెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోత్కూరు, మార్చి 13 : గ్రూప్-2లో రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకు సాధించిన మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభినందించారు. ఇటీవల గ్రూప్-2 ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం పాఠశాలలో సాయికృష్ణారెడ్డి, ఆయన తల్లిదండ్రులను మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి అభినందించారు. అదేవిధంగా మూడు నెలల కింద గ్రూప్ -4 ఫలితాల్లో ఉత్తీర్ణత పొంది స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం పొందిన సాయికృష్ణారెడ్డి సోదరి సుప్రియారెడ్డిని సత్కరించారు. సాయికృష్ణారెడ్డి మోత్కూరు సెక్రెడ్ హార్ట్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, కొత్తపేటలోని నారాయణ కాలేజ్‌లో ఇంటర్మీడియట్, అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం సాయికృష్ణారెడ్డి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ వీరేశం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరేశం

ఆలేరు టౌన్, మార్చి 13 : అసెంబ్లీలో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటును అధికారికంగా ప్రకటించాలని రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ వీరేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. రెవెన్యూ డివిజన్ చేస్తేనే ఆలేరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఐలయ్యను గెలిపిస్తే ఆలేరును వంద రోజుల్లో రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డితో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రకటన చేయించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కో కన్వీనర్ రాచకొండ జనార్దన్, మొరిగాడి చంద్రశేఖర్, కెమిడి ఉప్పలయ్య, ఎండీ ఖుర్షీత్ పాషా, సత్యం, పద్మాసుదర్శన్, సమరసింహారెడ్డి, వెంకటేశ్, రవి, అశోక్, కృష్ణ, హరి, అంజిబాబు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన

ధర్మారంలో మాట్లాడుతున్న జాతీయ మాంస పరిశోధన డైరెక్టర్ బార్బ్యుడ్

తుర్కపల్లి, మార్చి 13 : మండలంలోని ధర్మారంలో గురువారం పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ మాంస పరిశోధన డైరెక్టర్ బార్బ్యుడ్ మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలైన 130 మంది మహిళలకు ఒక్కొక్కరికి 20కోళ్లు, 20కిలోల దాణా, నీటితొట్లు అందజేయడం అభినందనీయమన్నారు. పెరటి కోళ్ల పెంపకాన్ని మహిళలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదుగాలని సూచించారు. శాస్త్రవేత్త బస్వారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్, పశు వైద్యాధికారి రామచంద్రారెడ్డి, సునీత, శంషొదీన్, రాఘవేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సైదులు

గుండాల, మార్చి 13 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సైదులు అన్నారు. మండలంలోని పాచిల్ల గ్రామంలో గురువారం మోత్కూర్ - గుండాల మెయిన్ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. వాహనదారులు వేగాన్ని తగ్గించుకొని ప్రయాణం చేయాలని సూచించారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకన్న ఉన్నారు.

ఆలేరును కరువు మండలంగా ప్రకటించాలి : సీపీఎం

శర్బనాపురంలో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆలేరు రూరల్, మార్చి 13 : ఆలేరును కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. మండలంలోని శర్బనాపురంలో ఎండిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన ఆలేరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సుదగాని సత్యరాజయ్య, కారె రాజు, మల్లేశ్, యాదగిరి, ఎర్రయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ చెల్లింపులో జిల్లాను ముందుంచాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 13 : 2023-24 యాసంగి సీజన్‌లో జిల్లాలో 96శాతం బియ్యం డెలివరీ పూర్తయిందని, మిగతా 4శాతం గడువులోపు పంపి జిల్లాను ముందు వరుసలో ఉంచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మిల్లర్లు ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అందజేసేందుకు ఈ నెల 17 చివరి తేదీ అయినందున గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, అధికారులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం ధాన్యానికి సంబంధించి బియ్యం డెలివరీ చేయనివాళ్లు వెంటనే మొదలు పెట్టాలన్నారు. మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు ఇప్పటి నుంచి మిల్లులను చెక్ చేసి నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలనానరు. బియ్యం సరఫరా పూర్తి చేయని మిల్లర్లకు యాసంగి ధాన్యం కేటాయింపులు చేయమని తెలిపారు. మిల్లర్లు దించుకున్న ధాన్యానికి సరిపడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, 2022-23 యాసంగి ధాన్యానికి చెల్లింపులు పూర్తి చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలని సూచించారు. మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేశం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వనజాత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

భూదాన్ పోచంపల్లి : ఎమ్మెల్సీ కవితకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష తదితరులు

భువనగిరి అర్బన్, మార్చి 13 : జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ఎన్నబోయిన ఆంజనేయులు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్, నువ్వుల సత్యనారాయణ, సుబ్బూరు బీరు మల్లయ్య, ర్యాకల శ్రీనివాస్, ఇట్టబోయిన గోపాల్, పద్మ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి కవితకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు భాస్కర్‌నాయక్, కర్ణాకర్, ప్రభాకర్, రమేశ్, యాదయ్య, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి : జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కందాల భవాని, పీహెచ్‌సీ అధ్యక్షురాలు పెద్దల సువర్ణ, నాయకులు మంజుల, మమత, అరుణ, వజ్రమ్మ, గీత, వరమ్మ, రాధిక, చందన, కవిత, విమల తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపల్లి కాల్వలో గుర్రపు డెక్కాకు తొలగింపు

వలిగొండ, మార్చి 13 : మండలంలోని సంగెం గ్రామం నుంచి గోకారం రామసముద్రం చెరువు రైతులకు సాగునీరందించే ధర్మారెడ్డిపల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కాకుతోపాటు పూడికను దివీస్ లేబొరేటరీస్ కంపెనీ సహకారంతో గురువారం తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా దివీస్ కంపెనీ ప్రతినిధి బి.గోపి మాట్లాడుతూ రైతుల పంట పొలాలకు సాఫీగా సాగునీటిని అందించేందుకు ధర్మారెడ్డిపల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కాకు, పూడికను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బద్దం సంజీవరెడ్డి, సత్యనారాయణ, తుర్కపల్లి సురేందర్, సురేశ్, నర్సింహ, దివీస్ కంపెనీ ప్రతినిధి జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసుంధర కలర్ ల్యాబ్‌లో చోరీ

చౌటుప్పల్, మార్చి 13 : పట్టణంలోని వసుంధర కలర్ ల్యాబ్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి వసుంధర కలర్ ల్యాబ్ యజమాని చింతల గణేశ్ షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం దుకాణం తీసేందుకు వెళ్లగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రూ.20వేల విలువైన కెమెరా, 1,500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొరటికల్ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు

ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్

ఆత్మకూరు(ఎం), మార్చి 13 : మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దడిపల్లి వెంకన్న కృషితో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అందులో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పెంపకం చేపడుతున్నారు. రోజూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో కిచెన్ గార్డెన్‌లో కాసిన కూరగాయలు, ఆకుకూరలను వాడుతున్నారు.

'రైతు చట్టాలను సవరించాలి'

ఆత్మకూరు(ఎం), మార్చి 13 : కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్న రైతు చట్టాలను సవరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్క దయాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన రైతుసంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతు భరోసా అందజేయాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య, రైతు సంఘం మండలాధ్యక్షుడు ఉప్పల కొమురయ్య, నాయకులు భగవంత్, పకీరానాయక్, మల్లయ్య పాల్గొన్నారు.

గండి చెరువులోకి నీళ్లు రాకుండా అడ్డుకట్ట

మల్లాపురం వద్ద ఓటీ - 2 కాల్వకు మట్టితో అడ్డుకట్ట వేసిన అధికారులు

యాదగిరిగుట్ట, మార్చి 13 : గండి చెరువులోకి నీళ్లు విడుదల చేసేందుకు ప్రత్యేకంగా నిర్మించిన ఓటీ -2 కాల్వకు ఇరిగేషన్ అధికారులు అడ్డుకట్ట వేశారు. దాంతో గండి చెరువుతో పాటు కింది ప్రాంతానికి నీళ్లు రాకుండా పోయాయని రైతులు పేర్కొంటున్నారు. సాగునీళ్లు రాకుండా అడ్డుకోవడమేంటని మల్లాపురం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి చెంతకు గోదావరి జలాలు తీసుకురావాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ బస్వాపూర్ జలశయానికి నీళ్లను విడుదల చేసే కాళేశ్వరం 15వ ప్యాకేజీ ప్రధాన కాల్వను నిర్మించారు. ఈ కాల్వకు తుర్కపల్లి మండలంలోని రాంపూర్ తండా వద్ద ప్రధాన కాల్వకు అనుసంధానంగా 8కిలోమీటర్ల మేర ఓటీ -2 కాల్వను గండి చెరువు వరకు నిర్మించారు. మల్లాపురం ప్రధాన రోడ్డు వరకు పనులు కాగా, మిగతా ప్రాంతంలో పైపు లైన్ నిర్మించి గండి చెరువును నింపారు. ఇప్పుడు చెరువులోకి నీళ్లు రాకుండా మట్టితో అడ్డుకట్ట వేయడంతో రైతులు ఆగ్రహిస్తున్నారు. ఇక్కడి ప్రాంతానికి చెందిన రైతులే అడ్డుకట్ట వేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారి బాలకృష్ణను వివరణ కోరగా దాతారుపల్లి, యాదగిరిగుట్ట చెరువులను నింపేందుకు మట్టితో అడ్డుకట్ట వేశామని అన్నారు. వాస్తవానికి కాల్వకు క్రాస్ రెగ్యులేటర్ నిర్మించాల్సి ఉందని, ఇందుకు నిధులు మంజూరు కాలేదని తెలిపారు. ఈ క్రమంలో తాత్కాలికంగా మట్టితో అడ్డుకట్ట వేయాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ కాల్వ గుండా నీటి సరఫరా నిలిపివేశామని చెప్పారు. ఈ కాల్వను గండి చెరువు నింపేందుకే నిర్మించినట్లు వెల్లడించారు.

వైద్య కళాశాల ఏర్పాటుపై స్పష్టతనివ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, మార్చి 13 : ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. మూడేండ్ల క్రితం గత ప్రభుత్వం మల్లాపురంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసిందని, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన ఏఐవైఎఫ్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా వైద్య కళాశాల ఏర్పాటుపై స్పష్టత నివ్వకపోవడంతో ప్రజలు, వైద్య విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య కళాశాల నూతన భవనాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని 12 వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎర్ర అశోక్, ప్రధాన కార్యదర్శిగా కంబాల వెంకటేశ్, ఏడుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు కంబాల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నర్సింహ, తోటకూరి శేఖర్, సంగి అరవింద్, నర్సింహ పాల్గొన్నారు.

కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సీపీఎం



కాల్వ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 13 : బస్వాపురం ప్రాజెక్టు నుంచి ముత్తిరెడ్డిగూడెం పొలాల వద్దకు రైతులు, వృత్తిదారులు పోవడానికి కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య కోరారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో గురువారం ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బస్వాపురం ప్రాజెక్టు నుంచి ముత్తిరెడ్డిగూడెం మీదుగా వెళ్లే కాల్వ దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులతో కలిసి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు కాల్వ అవతల ఉన్న భూముల దగ్గరికి రైతులు, వృత్తిదారులు ఎలా వెళ్తారనే సోయి లేకుండా కాల్వను తవ్వారని విమర్శించారు. కాల్వ అవతలి భాగంలో వందలాది ఎకరాల భూములు ఉన్నాయని, పాడి రైతులు, గొర్ల కాపర్లు, మత్స్య కార్మికులు ఎలా పోతారని ప్రశ్నించారు. పలుమార్లు ఆందోళనలు చేస్తే కాల్వలో పైపులు వేసి మట్టి పోశారని, శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండ అశోక్, రైతులు ఐలయ్య, కుమార్, రమేశ్, నర్సింహ, లింగం, మంగమ్మ, దినేశ్ పాల్గొన్నారు.

న్యాయవాది దర్శనం నర్సింహకు దళిత సంఘాల అభినందన

మోత్కూరు, మార్చి 13 : మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసును వాదించి నిందితులకు తగిన శిక్ష పడేలా కృషి చేసిన న్యాయవాది దర్శనం నర్సింహను దళిత సంఘాల నాయకులు అభినందించారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యులు దాసరి తిరుమలేశ్, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నాగేశ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు హోళీ శుభాకాంక్షలు : కలెక్టర్

కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 13 : హోళీ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ హనుమంతరావు జిల్లా ప్రజలకు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోళీ వేడుక ప్రజలందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హోళీ వేడుకలు జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రం-1లో హోళీ వేడుకలను చిన్నారులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. అంగన్‌వాడీ టీచర్ దంతూరి భాగ్యమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

సమాజంలో సేవా భావం పెరుగాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

అనాథ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 13 : తల్లిదండ్రులపై గౌరవం, సమాజంలో నైతిక విలువలు, సేవాభావం పెరుగాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన షేర్ ద విజన్ సేవా సంస్థ సమకూర్చిన రూ.2లక్షల విలువైన నిత్యావసర సరుకులను పట్టణంలోని రాయగిరి సహృదయ అనాథ వృద్ధాశ్రమానికి అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన దాంట్లో కొంత అవసరమైన వారికి దానం చేయడం, మానవత్వంతో సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. మనిషి ఎంత సంపాదించినా చివరికి మట్టిలో కలవాల్సిందేనని గుర్తు చేశారు. స్వార్థంతో జీవిత కాలమంతా దాచి పెట్టిన సొమ్ము వెంటరాదని, చివరికి పరుల పాలవుతుందని తెలిపారు. తమ సంతానానికి ఆస్తులు పంచి ఇవ్వడం కాకుండా నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. షేర్ ద విజన్ సంస్థ అధ్యక్షుడు పాల్ సుగుణారావు, ఉపాధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ 2013లో తాము షేర్ ద విజన్ సేవా సంస్థలు ప్రారంభించామని, ఇప్పటి వరకు సుమారు వంద వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు నిత్యావసర సరుకులు అందజేశామని చెప్పారు. అండలేనివారికి, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు, సమాజంలో నిరాధరణకు గురైన వారికి చేయూతనిస్తున్నామని వెల్లడించారు. తమ సంస్థ సభ్యులు సంపాదించిన దాంట్లో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు యాకూబీ చోటు మాట్లాడుతూ ఆదరించేవారు లేక అల్లాడుతున్న వృద్ధులను చూసి మనసు చలించి ఈ ఆశ్రమం ప్రారంభించామన్నారు. ఇందులో 150 మందికి ఆశ్రయం కల్పించి ఏ లోటు లేకుండా పోషిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సుక్క సుదర్శన్, సుధీర్, అఖిల్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి : డీఎంహెచ్ఓ

డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోదను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ మనోహర్

భూదాన్ పోచంపల్లి, మార్చి 13 : మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని విభాగాల మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని, రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద, మండల వైద్యాధికారి శ్రీవాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, సూపర్‌వైజర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట : ఏసీపీ

దేవాలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, మార్చి 13 : సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నేరాలను అరికట్టడం సులువు అవుతుందని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవులమ్మ నాగారం గ్రామంలో సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రైవేటు పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ మన్మథ కుమార్, నోషిల్యాబ్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ అధ్యక్షుడు దాచెపల్లి మనోహర్‌గుప్తా, బొమ్మ రాములు, దోనూరి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి : డీఈ

నేలపట్లలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న డీఈ మల్లికార్జున్

చౌటుప్పల్, మార్చి 13 : నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మణికంఠ, కంఠమహేశ్వర కాలనీల్లో, మండలంలోని పంతంగి, అంకిరెడ్డిగూడెం, ఆరెగూడెం, నేలపట్ల, లింగోజిగూడెం తదితర గ్రామాల్లో 100కేవీ సంబంధించిన 12 ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ పద్మ, ఏఈ రాజుల సతీశ్ పాల్గొన్నారు.